
# పట్టుపురుగు




ఎదురు చూడడం ఒక పరీక్ష. ఇంకా చెప్పాలంటే అదొక చిత్రమైన శిక్ష. అది పరీక్ష కావచ్చు. లేదా శిక్షే కావచ్చు. అనుభవించాలంటే ఓర్పును సొంతం చేసుకొనక తప్పదు. అది చేతకాకపోతే కొన్ని సమయాల్లో అపార్థాలు మరికొన్ని సందర్భాల్లో అనర్థాలు తప్పనిసరి. ఇది అనుభవిస్తే కానీ అందని గుణపాఠం!

సాధారణంగా మనిషి భౌతికంగా కొన్ని పరిస్థితుల మధ్య ఇరుక్కొన్నప్పుడు మనసును కట్టిపెట్టినా అది కుదురుగా ఉండదు. తనదైన రీతిలో రకరకాల ఆలోచనలకు ఊపిరిపోస్తూ ఉంటుంది.

అప్పటి నా పరిస్థితి అదే!

"పీటి దుంపదెంచి గంపకెత్త. వస్తే గొర్రెనక గొర్రె మాదిర ఒకదాని మిందొగిటి పడ్తా ఒక్క మోపన వస్తాయి. లేకుండాబోతే అలిగిన అల్లుళ్ళ మాదిర నీలుక్కుంటాయి."

మాట సూటిగా గుండెకు తగిల్తే నా ఆలోచనా స్రవంతి తెగిపోయింది. ప్రయత్న పూర్వకంగా చూపులు అటు తిరిగాయి. ఆ అవతారాన్ని చూస్తూ ఉంటే అక్షరానికీ అతగాడికీ ఆమడల దూరం అనిపిస్తూ ఉంది. అయినా ఆర్టీసీ బస్సులు అతనికి కూడా కవిత్వం నేర్పించేస్థాయికి ఎదిగాయే అని అనుకొంటే ఒక స్పష్టమైన చిరునవ్వు పెదవులమీద చలించింది.

అతడు మనిషే. నేనూ మనిషినే! ఇద్దరూ ఎదురుచూస్తున్నది ఎర్రబస్సుకోసరమే. అయితే ఆ ఎదురుచూపు సంతరించుకొన్న భావాలకు సారూప్యమే లేదు. పుర్రెకొక బుద్ధిగదా? అంతలోనే ఈ చపలచిత్తం అతన్ని వదిలిపెట్టింది. నన్ను పట్టుకొనింది. క్షణాల్లో ఇంటి ముందర వాలింది. ఆ ఇంటిముందు గుమ్మానికి బల్లిలా అతుక్కొని ఎదురుచూపుల్ని వీధికి తగిలించి నాకోసం ఎదురుచూసే మా శ్రీమతి మనసును అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంది.

అంతలో మీదపడి తొక్కుతుందన్నట్లుగా ఒక ఎర్రబస్సు.

"ఫరవాలేదు. ఎదురుచూపుల ముసుగులోనుంచి శ్రీమతిని తొందరగా విముక్తి చేయవచ్చు!" అనుకొంటూ ఆ బస్సు వైపు చూశాను. దాని గమ్యం నన్ను వెక్కిరిస్తూ ఉంది.

"అన్నా! ఇక్కడ బస్సుకోసం ఎదురుచూస్తూ నిలబడినంతసేపూ ఆ బస్సులో కూర్చుంటే భాకరాపేట చేరుకోవచ్చు. అక్కడ నెరబైలు తలకోన నుంచి వచ్చే ఏ బస్సయినా దొరుకుతుంది. లేదా ఈలోపుగా మదనపల్లె బస్సే వచ్చిందనుకో! ఇక్కడ ఎక్కే బస్సును అక్కడే ఎక్కచ్చుగదా?" అన్నాడు ఖాదర్.

నిలబడే ఓపిక దాదాపు నశించింది. తమ్ముడు ఖాదర్ చెప్పినమాట సమంజసంగానే తోచింది. మారుమాట్లాడకుండా బస్సెక్కి కూర్చున్నాను. ఖాదర్ రెండుచేతులూ జోడించి 'పునర్దర్శనం' అని అడుగుతున్నాడు.

"మళ్ళీ కలికిరి మాట మనసులో మెదిలినప్పుడు!" అన్నాను నవ్వుతూ.

'రైట్! రైట్!!' అన్న కండక్టర్ కీచుకొంతు చెవుల్ని దిమ్మెక్కించింది.

బస్సు కదిలింది. మెల్లగా వేగాన్ని పుంజుకొంటూ ఉంది. బస్సు కనుమరుగయ్యే వరకు ఖాదర్ నిలిచినచోటే నిలబడతాడు. నిలబడి నావైపుచూస్తూ నన్ను గురించే ఆలోచిస్తూ ఉంటాడు. బస్సుతో కలిసి ఈ కట్టె ముందుకు పోతున్నా- వెనకదారిపట్టిన ఆలోచనలు ఖాదర్ చుట్టూ తిరుగుతూ ఉంటాయి. అది అంతే! ఏకాభిప్రాయాలతో గౌరవభావం. గౌరవభావంతో ఆత్మీయతలు...ఆత్మీయతలతో లింగభేదాల ప్రసక్తిలేని స్నేహమాధుర్యం!

స్నేహమాధుర్యానికంటే మధురమైనది ఏముంటుందీ లోకంలో?

అయితే ఈ మాధుర్యమంటే మా ఇంటామెకు చిరుచేదు మింగినంత ఛీత్కారం!-

అందుకే కలికిరి ప్రయాణం మాటెత్తితే చాలు... "ఏం మొగోడమ్మా ఈ మొగోడు? మూడు మూణ్ణాళ్ళకు 'కలికిరి! కలికిరి!' అని కలవరిస్తా ఉంటాడు. కాలూచెయ్యి పడిపోయేనోడు గదా కలికిరికి పొయ్యేది. ఆడ ఎవుడుండాడని? పోనీ ఏముండాదని? కాదుగీదంటే ఆ కాదర్ మింద

సాకుపెట్టుకొని పొయ్యేది. కారాని పోరాని చోట్లల్లో చెయ్‌రాని పన్లు చేసేది. ఉసుక్‌మంటే చాలు. ఈన్నె గొడ్డుమాదిర ఎగబెట్టుకొని పరిగిత్తాడు. దమ్మిడి ఆదాయం ఉండేటట్టుగా ఉంటే దరణిమింద నిల్చునా ఈ మొగోడు. అయినా ఈ అల్లీబిల్లీ తిరుగుళ్ళెందుకు? కలికిర్లోనే కాపరం పెట్టేస్తేపోలా?"

ఈ విభిన్న దృక్పథాల సహజీవనంలో నా కలికిరి ప్రయాణానికి ఆటంకాలు కలగకపోవడం భార్యాభర్తల అనుబంధానికి నిదర్శనం. స్నేహమాధుర్యానికి ప్రదర్శనం.

కలికిరి క్రాస్ దగ్గర ఉన్నట్లుండి ఆగిన బస్సు చక్రాలకిందపడి నా ఆలోచనలు నిర్దాక్షిణ్యంగా నలిగిపోయాయి! ఇంటి వాతావరణానికి వీడ్కోలు పలికిన మనస్సు బస్సును సర్వే చేస్తూ ఉంది.

ఇద్దరు ముగ్గురు దిగారు. నలుగురైదుగురు ఎక్కారు. ఎవరో ఒక వ్యక్తి మొలగుడ్డ తలగుడ్డ తప్పితే నూలుపోగులేదు. కష్టంతో కాయవాటందేరిన ఒళ్ళు. పుడమితల్లికి తల ఆనించి మొక్కుతున్నట్లుగా వంగాడు. శరీరంలోని శక్తినంతా రెండుచేతులు కూడగట్టుకుంటే మోకాళ్ళవరకు లేచింది ఎరువు మూట. ఇంకొక్క ముంపు ముంపితే మూట బస్సులో పడుతుంది.

"చెప్పేది నీకేనయ్యా! ఎన్నిసార్లు చెప్పాలి? ఎన్నిసార్లు చెప్పినా మాట ఒకటే. వేస్తావా టాప్‌పైన వేసుకో. లేదా మానుకో." కీచుకొంతు కీచురాయితో పోటీపడ్తూ ఉంది.

"సామీ! సామీ!... రొంపిచెర్ల క్రాస్‌కాడ దిగేస్తాను. ఈ రోంతదూరానికి పైన యేసి మల్లా దించుకోవాలంటే పీకులాట. చేతికందిన పైరు నోటికందకుండా పోతింది."

రైతును ఈ దేశంలో ఎవడు పట్టించుకొంటున్నాడు– కండక్టర్ పట్టించుకోవడానికి!

ఆ రైతు ఎరువులబస్తాను బస్సులో వేసుకోవడానికి పడిన ప్రయాస ఎదురైన నిరాశ స్మృతిపథాన్ని తొలుస్తున్నాయి. ఈ సీమలో రైతు ముద్దసంకటితో మురిసిపోతున్నాడు. ఉద్యోగాలు చేసేవాళ్ళకు ఊళ్ళేలేవాళ్ళకు పప్పన్నం పెడుతున్నాడు. వాస్తవానికి అతడొక పరమాత్ముడు. వాడే పలుబాట్లకు లోనవుతున్నాడు.

ఒక కవి కావచ్చు. కండక్టర్ కావచ్చు. లేదా ఒక జిల్లాకు కలెక్టరే కావచ్చు. ఎవడికైనా ఉండేది జానెడు పొట్ట. ఆ పొట్టకు కావాల్సింది పట్టెడన్నం. సమస్తమానవాళికి ఆ అన్నాన్ని సమకూరుస్తున్నది రైతు. అతడే ఇంత నిర్లక్ష్యానికి గురి అవుతున్నాడు.

బస్సు గమనాన్ని పట్టించుకోని మనసు పుడమితల్లితో పోరాడుతున్న రైతుచుట్టూ తిరుగుతూ తిరుగుతూ తలచుట్టి నోటివద్దకు వచ్చినట్లు తిరిగి బస్సులోకి వచ్చింది. ఎవరో ఆడమనిషి. చంకలో బిడ్డ. చేతిలో మోయలేనంత మూట. దిగలేక అవస్థపడుతూ–

"ఏమన్నా? ఈడ నిలిపిన బస్సును ఇంకొంచెం ముందర్నే నిలిపితే నీయబ్బ గంటేమన్నా పూడిస్తిందా? కండ్లారా చూస్తా ఉండావ్‌గదా నా అవతారం. ఈ చీగిట్లో ఇదెంతా ఏగించుకోని

పొయ్యేదంటే మాట్లా? నీకేం? కలెక్ట్రుమాదిర కూసోని 'రైట్ రైట్' అంటావ్. నామాదిర నీకూ కూడామాడా పుట్నోళ్ళు లేరా? మడిసి అని పుట్నాక అంతో ఇంతో దయారసం ఉండాలన్నా!"

ఆ స్టేజికి ముందు ఒక కాలిబాట. అక్కడే దిగితే ఆమెకు దాదాపు ఒక్క కిలోమీటర్ పైగా నడక కలిసి వచ్చేది. ఇప్పుడు మళ్ళీ ఆ చిమ్మచీకట్లో అంత దూరం వెనక్కు నడవాలి. ఆమె బాధ ఆమెది. ఆర్టీసీ బస్సును స్టేజి దగ్గర తప్పితే మధ్యేమార్గంలో నిలపడం చట్టవిరుద్ధం. చట్టవిరుద్ధంగా ప్రవర్తించడం నేరం. పాపం! కండక్టర్- అది ప్రయాణీకుల సౌకర్యం కోసరమే కావచ్చు. తెలిసి తెలిసి ఎలా నేరం చేస్తాడు?

ఒక అమాయక ఆడకూతురికి ఈ మాత్రం తెలియకపోవడం నిష్ఠురానికి దారితీసింది.

ఎన్ని నిష్ఠూరాలో... ఎన్ని తిట్లో... ఎన్ని దీవెనలో ఏ పూటకాపూట శుభ్రంగా మూటకట్టి బస్సు చక్రాలకింద పెట్టేస్తున్నారు కాబట్టి ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యోగం చేయగలుగుతున్నారు. ఈ విషయం అందరికంటే బాగా ఆ ఎర్రబస్సుకు అనుభవానికి వచ్చింది కాబట్టి-అది ముందుకు దూసుకొనిపోతూ ఉంది.

కలికిరి నుండి భాకరాపేటకు మధ్య దూరం 'ఓహో!' అంటే ముప్పై కిలోమీటర్లు. ఈ ప్రయాణంలోనే ఇటువంటి ముప్పై ముప్పై అరవై సంఘటనల్ని అనుభవానికి తెచ్చి భాకరాపేట చేరి నన్ను చూసి భారంగా నిట్టూర్చింది- ఆ అవకాశం నాకివ్వకుండా!

నేను బస్సు దిగడం... బోడేవాండ్లపల్లి నుంచి తిరుపతికి వెళ్ళే బస్సు రావడం – నేను ఇల్లు చేరుకొన్నంత తృప్తిని నా గుండెగూట్లో పొదిగించాయి. పరుగు నడకగా వెళ్ళి బస్సులో పడ్డాను. బస్సు కదిలింది. 'బతుకుజీవుడా!' అని సీటు వెదుక్కొనే ప్రయత్నంలో ఉన్నాను. నా ప్రయత్నం మీద నీళ్ళు చల్లినట్లుగా బస్సు బాటపక్కన నిలబడింది. డ్రైవర్ దిగాడు. ఏ అదృశ్యశక్తి ముందుకు లాగుతూ ఉందో? తిరిగి మళ్ళీ చూడకుండా మంత్రించి వదిలిన బొమ్మలా ముందుకుపోతున్నాడు.

"ఇక్కడొక పదినిముషాలు టైముంటుంది. ఫోంచేయాలనుకుంటే చేయచ్చు" అని కండక్టర్ ఒక సామూహిక ప్రకటన చేసి ఒక్కసారి బస్సును కలయచూసి బస్సు బస్సుగానే ఉందన్న సంతృప్తి వ్యక్తం చేస్తుంటే దిగాడు. బస్సులో ఒకరిమొగం ఒకరు చూసుకోవడం... లేవాలా? వద్దా? అన్న సందిగ్ధంలో పడడం... లేచినట్లు లేచి కూర్చోవడం.. కొందరు లేచి కండక్టర్ వెంట పడటం- బస్సులో ఒక విచిత్రమైన వాతావరణం!

అప్పుడు బస్సులో మొదలయింది కామెంట్రీ- క్రికెట్ కామెంట్రీని సవాలు చేస్తూ!

"ఈ ఆర్టీసీ వాళ్ళతో వచ్చిన తకరారే ఇది. ప్రజాసేవయే మా కర్తవ్యం అంటూ వాళ్ళ సౌకర్యం వాళ్ళు చూసుకుంటారు. లేకపోతే భాకరాపేట వదిల్తే బస్సు తిరుపతి చేరడం ఎంతసేపు? ఈలోపలే వీళ్ళకు ఆరకపోతూ ఉంది".

"అయ్యో పాపం! అట్లంటే ఎట్లా? ఉచిత భోజన వసతిగదా?"

"వాళ్ళు సుబ్బరంగా లాగిస్తేచాలు. బస్సులో వాళ్ళు ఏమైపోతే వాళ్ళకేం?"

"మనల్ని గూడా ఆహ్వానించారు గదా?"

"ఏం? విందుభోజనానికా?"

'అసలు కత అదిగాదయ్యా? అట్ట చూడండి.' మరొక ప్రయాణికుడు మాటలు మాన్పించి చూపులకు పనిపెట్టే- పట్టుపురుగు బస్తాలు... తోడుగా పొరక కట్టల మోపులు బస్సుమీదికెక్కడం కంటపడింది.

"అక్కడ వాళ్ళు లోడ్ చేసుకొనేలోపల ఇక్కడ లగేజీలోడవుతుంది. రెండు పక్కలా మంచి గిట్టుబాటు గదా? వద్దనేస్థాయికి ఈదేశం ఇంకాఎదగలేదు".

"ఈళ్ళదేముండాదిపాపం! దంచితే నూకాకాదు. పొట్టూగాదు. మన ఓట్లతో గెల్చిన మహన్నబావులే గుట్టుచప్పుడుగా గుళ్ళూ గోపురాల్నే మింగేస్తా ఉంటే?"

"ఒక అర్థగెంట. అట్నోఇట్నో కొంపచేరుకుంటాం. దీనికెందుకింత మల్లగుల్లాలు పడ్తా ఉండారే? పాపం! ఒక కొంపాగోదా? యాళకు తిండీ తిప్పలా? వాళ్ళ తిప్పలు వాళ్ళవి. గెడ్డన కూసోని ఎవ్వడైనా చెప్తాడు నీతులు!"

"ఇతడు తప్పక రైతుగానే ఉండితీరాలి. కాకుంటే ఈ సర్దుబాటు తత్త్వం ఇంత బాగా ఒంటపట్టదు" అని ఆలోచిస్తూ అతని పరిశీలించి చూశాను. "ఓహో! ఎంత బాగా ఊహించావు?" అనుకొంటూ నా భుజాన్ని నేనే తట్టుకొన్నాను.

పుర్రెకొకబుద్ధి అన్నట్లుగా అంతవరకు బస్సులో పరస్పర విరుద్ధంగా వగలు పడిన రకరకాల అభిప్రాయాలు డ్రైవర్ కండక్టర్ బస్సెక్కి నిలబడి బ్రేవ్‌మని తేపితే అతేపుల్లో కలగలిసిపోయాయి.

బస్సు బయలుదేరింది.

భాకరాపేట నుండి రంగంపేట వరకు కనుమదారి. మధ్యేమార్గంలో ఊళ్ళులేవు. కనుమ ఎక్కేటప్పుడు ఆపసోపాలు పడిన బస్సు ఇప్పుడు కనుమ దిగుతున్నది గదా?- అవలీలగా ఆఘమేఘాలమీద! నల్లని చీకట్లో మునిగిన చెట్లు ప్రశాంతతలో మెల్లగా కరిగిపోతూ బస్సులో మొగాలకు భయాందోళనల్ని పులుముతున్నట్లున్నాయి. బస్సులో చిత్రమైన స్తబ్ధత. కారణం ఊహించే ప్రయత్నంలో మనసు గతంలోకి మళ్ళితే- రెండు మూడు వారాల కిందట ఆ కనుమదారిలో జరిగిన సంఘటన. ఒళ్ళు జలదరించింది. ఎవరో దుండగులు దారికడ్డంగా పెద్దపెద్ద రాళ్ళుపెట్టి బస్సును ఆపి కత్తులు కటార్లతో బస్సుమీద పడి నిలువుదోపిడి చేశారు. కాలగమనంలో కరిగిపోని సంఘటన కదా? అందరినీ కలవరపెడుతున్నట్లుంది.

ఇదంతా పట్టించుకోని బస్సు ముందుకు దూసుకొనిపోతూఉంది. నా మనసు క్షణాల్లో కలికిరిలో వాలి ఖాదర్ ముందు తిష్టవేసింది. కాలపరిస్థితికి స్పందించిన ఖాదర్ ఏమన్నాడు?

"అన్నా! రవిడీయిజమే రాజకీయమైనప్పుడు భయం తన పెత్తనాన్ని చలాయించకుండా ఉంటుందా? అయినా చూడండి. అది తన పెత్తనాన్ని చలాయిస్తా ఉండేది ఒకరకంగానా?

ఒక నాయకుణ్ణి చూస్తే ఇంకొక నాయకుడికి భయం. ఒక వర్గాన్ని చూస్తే ఇంకొక వర్గానికి భయం. ఒక ప్రాంతాన్ని చూస్తే ఇంకొక ప్రాంతానికి భయం. ఒక మతాన్నిచూస్తే ఇంకొక మతానికి భయం. ఒక దేశాన్ని చూస్తే ఇంకొక దేశానికి భయం. ఇన్ని భయాల మధ్య సామాన్యుడు గుండెల్ని అరిచేతిలో పెట్టుకొని హడలి చస్తున్నాడు".

"సామాన్యుడుగద తమ్ముడూ! వాడి గతి అంతే!"

"ఈ పరిస్థితుల్లో వాడేం చేస్తాడన్నా? ఇంటితలుపు తీయాలంటే భయం. వీధిలోకి నడవాలంటే భయం. ఓటు వెయ్యాలంటే భయం. అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలంటే భయం. బస్సెక్కాలంటే భయం. బయలుదేరితే తిరిగి ఇల్లు చేరగలమా అన్నది అన్నిటికీ మించిన భయం".

"ఇన్ని భయాలమధ్య దినగండం నూరేండ్లుగా బతుకుతున్న ప్రజానీకాన్ని గురించి ఎవరాలోచిస్తున్నారు?"

"స్వార్థం పడగవిప్పి ఆలోచనల మీద బుసకొడ్తూ ఉంది. ఏ రంగాన్ని తీసుకున్నా అది ఈ రాజకీయ సుడిగుండంలో పడి సుళ్ళు తిరుగుతూ ఉంది. అధికార వర్గంలో రాజకీయం. సేవారంగాల్లో రాజకీయం. విద్యారంగంలో రాజకీయం. వైద్యరంగంలో రాజకీయం. వ్యవస్థ మార్పుకై తుపాకులు చేతపట్టినవాళ్ళల్లో రాజకీయం. కడకు సదవగాహనతో సమాజస్థితికి స్పందించాల్సిన సాహితీలోకంలో కూడా రాజకీయం. ఈ రాజకీయాలతో తలతిరిగి పోతుంటే ప్రజానీకాన్ని గురించి ఆలోచించే వాళ్ళెవరు?"

"హుం! సాహితీ రంగంలో కూడా రాజకీయం?"

"దీనికి మనం కూడా అతీతులు కాలేకపోతున్నాం గదా!"

"కారణం?"

"సాహిత్యంతో సమాజాన్ని ఉద్ధరించాలన్న దృక్పథం మారింది కాబట్టి! ఆ సాహిత్యంతో తన్ను తాను ఉద్ధరించుకోవాలన్న తపన పెరిగిపోయింది కాబట్టి!! అందుకే రానురాను కవులు, రచయితలు తమతమ విలువల్ని కోల్పోతున్నారు. అలా విలువలు కోల్పోవడంతో మళ్ళీ రాజకీయాశ్రమం. ఇదొక విషవలయం. బయట పడడమంత తేలికకాదు!"

పక్కన కూర్చున్న వ్యక్తి తూగి మీద పడడంతో ఇంతవరకు మనోయవనికపై పాత్రపోషణ చేసిన ఖాదర్ తప్పుకున్నాడు. ఆలోచన పుటుక్కున తెగింది. మనసు బస్సులోకి వచ్చేసింది. పరిసరాలు చూపుల్ని గాలమేసి లాగితే బస్సు తిరుపతి పొలిమేరల్లో!

పక్కన నింగితో సమైక్యం చెందుతున్నట్లుగా ఉత్తరాన శేషాచలాలు... ఆ పర్వతాల్లో తిరుమలకు నడకదారిలో వరసగా రాలిన నక్షత్రాల విద్యుద్దీపాలు... చుక్కల పర్వత శిఖరాగ్రంలో శంఖచక్రాలను భుజాలకు తగిలించుకొన్న గాలిగోపురం... ఊరి నడిబొడ్డులో ధవళశిఖరంలా వెలుగొందుతున్న గోవిందరాజస్వామి ఆలయగోపురం... విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నింగిని

ముద్దాడుకోబోతున్న నీలం సంజీవరెడ్డి భవనం. ఊరిపొలిమేరల్లో అడుగుపెట్టిన ఏ వ్యక్తి చూపునయినా కదలకుండా నిలిపే కమనీయ దృశ్యాలు. అయితే నా చూపు మాత్రం ఇంటిమీదనే! ఎదురుచూపుల్ని వీధికి తగిలించిన ఇల్లాలి మీదనే! 'పది గంటలలోపుగానే ఇల్లు చేరుకోవచ్చులే!' అన్న నా అభిప్రాయాన్ని సవాలుచేసినట్లుగా బస్సు టౌన్ క్లబ్ దగ్గర ఆగింది. డ్రైవర్ బస్సు దిగాడు. ఒళ్ళు విరుచుకొన్నాడు. అరచేతులు కడుపుకుందను పరామర్శిస్తుంటే హుందాగా నడిచాడు. టౌన్‌క్లబ్ పక్కనున్న క్లబ్ సువాసనల్తోనే కడుపులు నింపుకొంటున్న కొన్ని గుడిసెలు. గుట్టుగా! ఆ గుడిసెల ముందొక నులకమంచం. తనకోసమే ఎవరో అమర్చిన అందాల సింహాసనమైనట్లు కూర్చున్నాడు. కాలిమీదికి కాలొస్తే చేయి జేబు తడిమింది. చేతికందిన సిగరెట్ పెదాలను ముద్దాడుతుంటే పొగ వలయాలు అనుభూతికి నిలయాలై తేలిపోతున్నాయి.

"తొందర తొందరగా కానీయండయ్యా!" అంటూ ఒక హెచ్చరికను జారీచేస్తూ కండక్టర్ కూడా బస్సు దిగాడు. డ్రైవర్ పక్కన కూర్చొని ఆయన గారి పొగవలయాలను ఆస్వాదిస్తున్నాడు.

అప్పుడు గమనించాను... బస్సులో వెనుకవైపు సీట్లు. రెండు మూడు వరసలు టమోటా గంపలకే సరిపోయాయి. బస్సుపైన భాకరాపేటలో లోడైన లగేజీ ఉండనే ఉంది. ఎంత తొందర పెట్టినా లగేజీ అంతా దించడానికి అధమపక్షం అర్ధగంటకు పైగా పడుతుంది. అప్పటికే పది దాటుతూ ఉంది.

నా ఒళ్ళు రగిలింది. రగలదా? గబ గబా బస్సు దిగాను. ఆకలి ఆలస్యంతో చేయికలిపి కోపంగా మారి ఆవేశమై కాళ్ళల్లో జొరబడితే ఒక్క ఊపులో కండక్టర్ ముందు నిలబడ్డాను. నన్ను చూస్తూనే అతడు ఎగిరిపడి పైకిలేచాడు. బహుశా నా ఆవేశాన్ని పసిగట్టినట్లుంది.

"ఏమయ్యా? నాకు తెలియక అడుగుతున్నాను. ఇది గూడ్సు బండా? పాసింజర్ బండా?" ఎగసెగసి పడుతున్న నా ఎకసక్కానికి అతడే మాత్రం చలించకుండా–

"సార్! మీరు మంచి రచయిత గద సార్?"

"అది సరేనయ్యా! అడిగిందేమి? నువ్వు చెప్పేదేమి?" విసుగును దట్టించి అక్షరక్షరాన్ని వత్తివత్తి పలికాను.

"చెప్తున్నాను సార్! అసలు కథ రాయాలంటేనే జీవితం తెలియాలి. రైతును గురించి రాయాలంటే గ్రామీణ జీవితం మీద క్షుణ్ణమైన అవగాహన ఉండాలి. ఆ జీవితాలు వలలకు, కలలకు లొంగవు. ఊహలకు దొరకవు. మరీ పట్టణాలకే పరిమితమైన అనుభవాలు ఊళ్ళపొలిమేరల్లో కూడా అడుగుపెట్టలేవు. ఈ స్థితిలో మీరు ఏటికి ఎదురీదారు. మీకు గుర్తుందో? లేదో?– ఒక కథలో మీరు రైతును పట్టుపురుగుతో పోల్చారు. పట్టుపురుగు పట్టును ఉత్పత్తి చేస్తుంది– మన ఒంటిమీద తళతళల కోసం. రైతు ఆహారోత్పత్తిని చేస్తాడు– మన కండ్లల్లో మిలమిలలకోసం. ఇద్దరికీ సామ్యం ఇక్కడే!– మీరింకా బాగా చెప్పారనుకోండి. పట్టుపురుగును చంపి దాని ఉత్పత్తిని అనుభవిస్తున్న మనిషి రైతును ఉత్పత్తి రంగనుంచి

బయటపడకుండా తొక్కిపట్టి వాడి ఉత్పత్తిని అనుభవిస్తున్నాడు. శ్రమ ఒకడిది. అనుభవం ఇంకొకడిది. మీకు చేతులెత్తి నమస్కరించాను."

నేను చేతులెత్తి నమస్కరించాల్సిన పరిస్థితిని జీర్ణించుకోలేని విషమస్థితి! అలసిన కండ్లల్లో ఆర్ద్రత కరుగుతూ!..

"సార్! బోడేవాండ్లపల్లి ఒక మారుమూల గ్రామం. ఈ ఒక్క బస్సు సౌకర్యం తప్పిస్తే అక్కడి రైతులకు రైళ్ళు లారీల్లాంటి రవాణా సౌకర్యాలేమీ లేవు. బస్సులోపల టమోటా గంపలు పైన పట్టుపురుగు బస్తాలు. ఇవి సకాలంలో మార్కెట్టుకు చేరకపోతే రైతు పడిన కష్టం ఏమవుతుంది? పోనీ? నిలవ చేసుకోవడానికి ఏవైనా సదుపాయాలున్నాయా? అంటే అవీ లేవు. ప్రయాణీకుల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని నేను లగేజీ వద్దంటాను. రైతుల పరిస్థితి ఏమిటో ఆలోచించండి".

కలికిరి క్రాస్‌లో రైతు ఎరువుల బస్తా చూపిస్తూ నన్ను వెక్కిరిస్తున్నాడు.

నా తల వాలిపోయింది.

"సార్! ఒక రచయితగా చెప్పండి. ఈ వ్యవస్థలో మనిషి ఎక్కడ ఇబ్బంది పడడంలేదో చెప్పండి. నేనే దానికి సరైన దృష్టాంతం. ఎమ్.ఏ. తెలుగు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై కడుపుకోసం కండక్టర్ ఉద్యోగంలో పడుతున్న ఇబ్బందులు ఎవరితో చెప్పుకోను? అయినా ప్రజలు రైల్వేగేట్ల దగ్గర ఇబ్బంది పడడంలేదా? రైల్వేస్టేషన్‌కు వెళ్ళితే ఆరు గంటలకు రావాల్సిన రైలు ఆరు గంటలు ఆలస్యంగా వస్తే ఇబ్బంది పడడంలేదా? మహానగరాల్లో ట్రాఫిక్ జామ్ అయితే ఈ ఇబ్బంది తప్పిందా? అన్నిటికీ మించి విలువైన ఓట్లను దుడ్లకో సారాయిబుడ్లకో అమ్ముకొని పడుతున్న ఇబ్బందులు గుర్తుకు రావడంలేదా?... అక్కడ నోరు మూసుకొని కూర్చునే జనం ఇక్కడ అన్నదాతను ఆదుకొంటుంటే అర్ధగంట ఆలస్యానికే కొంపలు మునిగిపోతున్నట్లు మా మీద విరుచుక పడుతున్నారే?"

చెంపమీద ఛెళ్ళున పడిన దెబ్బ తలనుపట్టి పైకిలేపింది.

"మీరు నా స్థానంలో నిలబడి ఆలోచించండి. నా అవగాహన సరైనదైతేనే నాతో ఏకీభవించండి."

నా చూపులు 'ప్రజాసేవయే మా కర్తవ్యం' అన్న బస్సుపై రాసిన రాతమీద పడ్డాయి. ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఈ మాత్రం అవగాహన ఉంటే మీరు రాసుకున్న రాతలకు అర్థం పరమార్థం ఉంటుందన్న సందేశాన్ని పట్టుకొన్న చేయి అతని భుజాన్ని తడుతూ ఉంది- ఆకలి ఇల్లూ ఒళ్ళూ అన్నీ మరిచి! ●

ఈనాడు ఆదివారం
(24, ఫిబ్రవరి 2002)